# చరిత్ర శకలం

కె. వివేకానందమూర్తి



ఉన్నట్టుండి ఏదో భరించలేని శబ్దం గుండె బ్రద్దలు వేసింది. అధిగమించిన వేగంతో పరిగెత్తుతున్న బస్సు ప్రయాణీకులందర్నీ ఒక్కసారి కుదిపి, బాణం తగిలిన పక్షిలా కీచు - అరిచి హఠాత్తుగా ఆగిపోయింది

డ్రైవరు క్రిందికిదిగేడు. చక్రాల వేపు వొంగి పరిశీలనగా చూస్తూ అన్నాడు- 'గిగండి! బండి దెబ్బ తింది'

కండక్టరు కూడా దిగిచూసేడు. అదేమాట తనూ చెప్పేడు. ప్రయాణీకులందరం క్రిందికి దిగేం. వెనుక వైపు వెలికివచ్చిన చక్రాలకేసి చూస్తూ - డ్రైవరు కండక్టరుతో ఏదో మాట్లాడుతున్నాడు. ఓ ముసిలాయన కండక్టర్ని అడిగేడు.- 'రిపేరీ వొచ్చిందేవిటి?'

'మరేనండి'

'ఇప్పుడప్పుడే కదల్దేవిటి?'

'కదల్దండి' కండక్టరు ఏదో హామీ యిస్తున్నట్లు చేప్పేడు.

'అస లేవైందేవిటి?' మళ్ళీ అడిగేడు ముసిలాయన.

'ఎనక సెక్రాలు దెబ్బతిన్నాయ్- నాలుగ్గజాలు ఎదర కెళ్ళిపొస్తె బండి తిరగపడి పోనేది. దేచి నేళ మంచిది.'

'సైడు మిర్రర్లోంచూ సేను. రెండూ ఎలిపికొచ్చిసియ్.' డ్రైవరు తన సామర్థ్యాన్ని ప్రకటించుకున్నాడు. ముసిలాయన ముక్కుమీద వేలేసుకున్నాడు. ఆయన భార్య కాబోలు - గుండెల మీద చెయ్యి పెట్టుకుంది. ఆ చెయ్యి క్రింద మంగళసూత్రాలున్నాయి.

ఎవరో మరోవ్యక్తి అన్నాడు. 'ఎంత ప్రమాదం తప్పింది!'

'ఇప్పు డేం చెయ్యడం?' మరో ఆసామీ ప్రశ్నించేడు.

'చక్రాలు ఫిరాయించాలండి.' డ్రైవరు జవాబు చెప్పేడు.

'ఎంతసేపవుతుంది?' నే నడిగేను.

'సెప్పలేనండి, యిటు పొచ్చే లారీ ఏదన్నా ఆపుసేసి వొయిటాగెల్లి హెడ్డాపీసుకి రిపోర్టిస్తే, స్పేరు బండో; రిపేరికి జీపో తోల్తారు. నే నెల్లాలి-ఆళ్లు రావాలి. ఫిటింగిచ్చాక బండి కదలాలి. ఏటి సేత్తాంలెండి? నయ్యం! పేణాలు దక్కేయ్!' డ్రైవరు జవాబు చెప్పేడు.

'మళ్ళీ ఎవరో విద్యార్థి అడిగేడు- 'మరయితే అందాకా రాంభజనే అన్నమాట?'

'మరి తప్పదండి. లేటువుద్ది సేనా' అన్నాడు కండక్టరు.

అప్పటికే జనం చాలామంది నట్టూరా చెట్లక్రిందికీ, పచ్చిక మీదికీ చెదిరిపోయేరు. రాంభజన చేస్తానన్న విద్యార్థి కూడా, మరో నలుగురు మిత్ర బృందంతో కలిసి కాస్త దూరంలో మెత్తటి గడ్డిమీద బైఠాయించేడు. భజన మొదలు పెట్టేందుకేమో — జేబుల్లోంచి చిడతలు తీస్తారు లావుంది అనుకున్నాను. కాని పేక తీసి ఆట పరిచేరు — చప్పుడులేని భజన!

నాంటిరి ప్రయాణీకు ణవడం వల్ల నా కేమీ తోచడంలేదు.

కాస్సేపటిక్రితం బస్సులో కూర్చుని మరో రెండు గంటలకల్లా విశాఖపట్నంలో కాఫీ త్రాగొచ్చు ననుకున్నాను. తీరా యిప్పుడు కాఫీ త్రాగడం కోసమే ప్రాణాల్తో మిగిలినట్టుయింది. చేతి వాచీ చూసుకొన్నాను. నాలుగైంది. సాయంత్రపు చల్లదనం కొంచెం కొంచెం తెలుస్తోంది. ఎండలో తారురోడ్డు ఎంచక్కా మెరుస్తోంది. రోడ్డుకిరువైపులా పచ్చని చెట్లూ, పొలాలూ, పొదలూ, దూరాన ఎత్తుగా కొండలూ, యింకా ఎత్తుగా వంగిన ఆకాశం—ప్రకృతి అందం ప్రయాణంలో బాగా కనబడుతుందనుకుంటూ.

రుమాలుతో ముఖం తుడుచుకుని దూరంగా చూసేను. చెట్లమధ్య ఏదో చిన్న పల్లెటూరు కనబడింది. దాదాపు మైలు దూరం వుండొచ్చు. ఎలాగో అలా నాకూ కాలహరణం చెయ్యాలనుంది మెల్లగా కదిలేను. పిల్లగాలి పీలుస్తూ, పిల్ల కాలువ గట్లు దాటుకుంటూ నెమ్మదిగా నడిచేను. అరగంట గడిచేసరికి ఆ వూళ్ళోకి అడుగు పెట్టేను.

బాగా చిన్న వూరులా వుంది. బహుశా వెయ్యిగడప వుంటుందేమో యిళ్ళన్నీ దాటుకుంటూ మట్టిరోడ్డు మీద మరో నాలుగు నిముషాలు నడిచేక చెరువొకటి కనబడింది. చెరువు కివతలగా ఒంటిగా, వెలివేయబడినట్టున్న ఒక పాత పెంకుటిల్లు జబ్బుమనిషిలా నిలబడివుంది. దాని కెదురుగా చిన్న ఖాళీ స్థలం వుంది స్థలమంతా పచ్చిక మొలిచింది

బాగా నడవడంవల్ల కాళ్ళు పీకుతున్నాయి. అక్కడికి పోయి కాస్సేపు కూర్చుందా మనిపించింది. అటువైపు కదిలేను. పచ్చికలోకి అడుగు పెట్టగానే స్థలం మధ్యగా ఏదో నా దృష్టి నాకర్షించింది. చకచకా అక్కడికి వెళ్ళేను. అది ఏదో మహాశిల్పం తాలూకు అవశేషం. మోకాళ్ళ క్రిందికి విరిగిపోయి మిగిలిన పాదాల జంట అది. రాతిమీద చెక్కేరు. అందమైన ఆభరణాల్నీ, క్రిందికి జారిన వస్త్రాన్నీ ఆకర్షణీయంగా అలంకరించి మలిచేరు. అది ఏనాటి శిథిలమో!— దానిలో యింకా నాజూకుతనం తొణికిసలాడుతోంది. పవిత్రత వుట్టిపడుతోంది. ఎవరో మహత్తర శిల్పస్రష్ట చేతుల్లో సృష్టింపబడినట్టుంది అది. ఇంతకుముందు నేను మొహంజోదారో, హరప్పా శిథిలాలుచూసేను. అజంతా ఎల్లోరాలు చూసేను. 'అమరశిల్పి జక్కన' సినిమా కూడా చూసేను నాకు శిల్పాలంటే పిచ్చి. ఆ పాదాల్ని చూడగానే, నేనింతవరకూ చూడని గొప్ప శిల్పితనం నాకు వాటిలో కనబడింది. ఇష్టంగా వాటిని చేతుల్తో ముట్టుకు చూసేను. అరగంటసేపు చూసేను— నడిచినంతసేపు. ఆ స్త్రీమూర్తి పాదాలు నాకెంతో నచ్చేయి. నా కప్పుడనిపించింది—ఆ పాదాలు ధరించే పూర్తి

విగ్రహం చూడగలిగితే ఎంత బాగుణ్ణో కదా— అని. కాని, ఆ అవకాశం నాకు దక్కలేదు. కేవలం శిథిలం మాత్రం చూడగలిగేను. అది నా మనస్సులో ముద్ర వేసింది. దాని పూర్తి స్వరూపాన్ని చూడలేకపోయినా, కనీసం దాన్ని మలిచిన 'మహాశిల్పి' నేనా చూసి తీరాలనిపించింది. ఆయన దిబహుశా ఈ వూరే అయ్యుంటుంది. ఆయనిక్కడివాడే అయ్యుంటాడు— అనే వూహాలు నాలో కలిగేయి. ఆయన్ని కలుసుకుని, మనసారా అభినందించే భాగ్యం కలిగితే బాగుణ్ణు అనుకున్నాను.

వంగిన వాణ్ని లేచి నిలబడ్డాను. వూళ్ళో వాకబు చేద్దామని వెనక్కి తిరిగేను. ఎదురుగా పాత పెంకుటింట్లో ఎవరో నివాసం వున్నట్టు తోచింది. ముందు అక్కడికి పోయి అడిగిచూస్తే సరి— అనుకుని ఆ యింటివేపు దారితీశాను ఇల్లు సమీపిస్తున్న కొద్దీ, నా మనస్సు నీడలో ఆ శిథిలం యింకా స్థిర పడుతోంది. దగ్గర కొచ్చేను. ఇల్లు కూడా శిథిలావస్థలోనే వుంది. విరిగిపోయిన నాగరికతా చిహ్నంలా, చితికిపోయిన అంతస్తుకి ప్రతీకలా కనబడింది. వానొచ్చినప్పుడు కాళ్ళు బురద కాకుండా యింటిముందు నాపరాతి ముక్కలు పరిచేరు. నేల బాగా వున్నా వాటి మీదుగానే నడిచి, అరుగులమధ్య మెట్లెక్కేను. తటపటాయించేక తలుపుతట్టేను. సమాధానం లేదు, నెమ్మదిగా నెట్టేను. దగ్గరగా జేరవేసిన తలుపు, సన్నటి శబ్దంతో తెరుచుకొంది. తల ముందుకివొంచి లోపలికి చూశేను. చాలా పెద్ద గది. హాలనుకుంటా. జీర్ణావస్థలో ఉంది. గోడలకి అక్కడక్కడ బెల్లులూడిపోతే మట్టి రాసేరు. ఓ పక్కగా చాంతాడుతో దణ్ణెం కట్టేరు. దానిమీద ఒక వెలిసిన

---

మందమతి ప్రొఫెసరుగారు, రైల్లో ప్రయాణంచేస్తూ పుస్తకం ఏదో చదువుకుంటూ, అందులో మునిగిపోయి, సర్వం మరిచిపోయాడు. ఇంతట్లో టిక్కెట్ కలెక్టర్ చెకింగ్ కొచ్చేడు. ప్రొఫెసరుగారు జేబులన్నీ గబగబా వెతికి, కంగారుపడి, టిక్కెట్టు కనబడక తెల్ల మొహం వేసి, కొసకి ఏడుపు మొహమే పెట్టేశాడు.


టిక్కెట్ కలెక్టరు ఆయన అవస్థ చూసి భరించలేక 'పోనీ లెండి సార్ ఫరవాలేదు. మీరు టిక్కెట్టు కొనే వుంటారు. నాకు తెలుసులెండి. నిశ్చింతగా ప్రయాణం చెయ్యండి' అన్నాడు.

'అది సరే— మరి— మరి నే నెక్కడ దిగడం?—' అన్నాడు ప్రొఫెసరుగారు.

చీరె, ఒక వెలవని జాకెట్టూ, యింకా ఏవో సొంతబట్టలూ, పేద బట్టలూ పడేసి వున్నాయి. ఏవో నాలుగైదు అందమైన శిల్పాల్ని గోడలు భరించ గలుగుతున్నాయి. క్రిందగోడ వారే బల్లలుపరిచేరు. ఆ బల్లలమీద పెద్దవి, చిన్నవి రకరకాల చెక్కటిశిల్పా లెన్నో వున్నాయి. వాటిలో చాలాభాగం స్త్రీ మూర్తులు. మిగతా వాటిలో రెండు ముసిలి గాంధీలు, నాలుగు పడుచు గోపికలు—మధ్య ఒక చిలిపి క్రిష్ణుడు, హృదయం లేకుండా తల మాత్రమే వున్న హిట్లరు, చెయ్యి విరిగిన ఛత్రపతి శివాజీ, జూలు మాసిన సింహమూ మొదలైనవి వున్నాయి. క్రిష్ణుడి చేతిలో పిల్లనగ్రోవి లేదు. విరిగిపోయిందనుకుంటూ — డ్యాన్సు చేస్తున్నట్టున్నాడు. సింహం నోట్లో బూజు పట్టింది. ఓ గోపికకి రొమ్ముల మధ్య లోయగా జారిన చోటు బీటు తీసింది — క్రిష్ణుడిమీది ప్రేమకి గుండెలో చోటు చాలక హృదయం పగిలినట్టు. అన్ని శిల్పాలూ అద్భుతంగా వున్నాయి నాకు. అపూర్వమైన ఆ శిల్ప సంపదని కాపాడేందుకని, తాపత్రయంతో మిగిలినట్టుగా వుంది హాలు. ఋతు పవనాల తాకిడికి, సూర్యుడు విసిరిన నిప్పులకి ధైర్యంగా ఎదురు నిలిచి, చివరికి జవం వీడిపోగా అసందర్భంగా క్రిందికి వొదిగిన యింటి పైకప్పు, నడుం విరిగిన పాక్ సిపాయిని గుర్తు చేస్తోంది.

నే ననుకున్న యిల్లు యిదే అయి వుంటుందని నిశ్చయించుకొని లోపలికి అడుగెట్టేను. విసన కర్ర శబ్దం వినిపించింది. హాల్లోకి సన్నటి పొగలు ప్రవేశిస్తున్నాయి లోపల వంట గదిలో ఎవరో పొయ్యి రాజేస్తున్నట్టుంది. తల పక్కకి తిప్పేను. వీధి వైపున్న గోడవార, కిటికీ పక్కగా నున్న పాత మంచ మీద ఒక వ్యక్తి పడుకుని వున్నాడు. బహుశా నే చూడాలనుకునే 'మహాశిల్పి' యీ వ్యక్తేనేమో! నన్నాయన గమనించ లేదు. తెరచివున్న కిటికీగుండా బయటికి చూస్తున్నాడు. దాదాపు అరవై ఏళ్ళ వయసుండొచ్చు. ఇంటిలాగే తనూ శుష్కించి వున్నాడు సాయంత్రపు వెలుగులో ఆయన పెద్ద గడ్డం వెండిలా మెరుస్తోంది మీసాలకీ, గడ్డానికీ నడుమ దాగి వున్న సన్నటి పెదాల కలయికలో, అనుభవాలు మిగిల్చిన గర్వం ఏదో వొంపు తిరిగినట్టుంది. లోతైన ఆయన కళ్ళలో లోయల్లో దాగిన ప్రశాంతత కనబడుతోంది. అంత వయసొచ్చినా, ఆ కళ్ళలో చురుకుదనం చచ్చిపోనందుకు కాస్త ఆశ్చర్యమేసింది. అలా ఒక్క క్షణం చూసేక నాకాయన అంపశయ్యమీద పడుకొన్న భీష్ముడిలా అగుపించేడు.

ఇంకా అక్కడ నా ఉనికి గుర్తింపబడక పోడంలో నా 'మహాశిల్పి'మీద నాకు ఆత్రుత పెరిగింది. చిన్నగా దగ్గేను. ఆయనకు వినబడి




నట్టుంది. 'ఎవరూ?–' అంటూ తల నాకేసి తిప్పిచూసేడు. నేనుమంచం దగ్గరికి నడిచి 'నేనండీ!' అని పేరు చెప్పేను. ఆయన యింకా ప్రశ్నార్థకంగానే చూసేడు. నేను మళ్ళీ చెప్పేను– 'నేనీ ప్రదేశానికి చాలా కొత్తవాణ్ని. విశాఖపట్నం వెళ్తూంటే దారిలో ఈ వూరిదగ్గర హఠాత్తుగా బస్సు పాడయింది. రిపేరు చేస్తున్నారు. నాలుగ్గంటలు పైగా ఆలస్యం ఉందిట. ఎందుకో ఈ వూరు చూసిపోదామని సరదా పుట్టింది. ఇలా వచ్చేను–' 'వచ్చేక' అని నేను యింట్లోకి ప్రవేశించిన కారణం చెప్పబోయేంతలో, ఆయన 'అలాగా అబ్బాయ్! చాలా సంతోషం!' అన్నాడు. 'అమ్మాయ్! కాసిని మంచినీళ్ళు పట్టుకురామ్మా!' అంటూ కూతుర్ని కాబోలు – పిలిచి నావైపు తిరిగేడు. ముఖంలో ఎంతో అనుభవం, పరిజ్ఞానం, స్వచ్ఛత ఉట్టిపడుతున్నాయి. ఏదో గొప్పకుటుంబంలో పుట్టి, చివరికి చితికి పేదవాడై పోయిన వ్యక్తిలా వున్నాడాయన. కూర్చోమని చెప్పేడు. మంచం పక్కనేవున్న పాత కుర్చీలో కూర్చున్నాను.

శిల్పాలకేసి చూస్తూ నేనన్నాను– 'నిజంగా యీ రోజు నేను చాలా అదృష్టవంతుణ్ని. ఇక్కడ మీ యింట్లో అద్భుతమైన శిల్పాలెన్నో చూడగలిగేను. నాకు శిల్పాలంటే చచ్చేపిచ్చి. మొదట్లో బయటి నుంచి యీ యిల్లు చూసినప్పుడు, యీ లోపల యింత శిల్ప శోభ వుంటుందని వూహించలేదు. అపూర్వంగా వున్నాయివి. ఇవన్నీ చూస్తూంటే — ప్రయాణీకుల బస్సులు యిలాగ అప్పుడప్పుడు

పొడవుతూ వుండాలనిపిస్తోంది నాకు.'

ఆయన భళ్ళున నవ్వేడు. ఆ నవ్వులో సంతోషంకంటే గర్వమూ, తృప్తీ కలిసి కనిపించేయి. నా కెందుకో యిల్లు కూలి పోతుం దేమోనని భయమేసింది. కప్పు కేసి చూసేను.

ఆయన నవ్వు పూర్తిచేసి, నా మోకాలి మీద చెయ్యి బలంగా మోపేడు – 'బాగుందబ్బాయ్! ఇన్నాళ్ళకి నా శిల్పాల గొప్పతనం చవి చూడగలిగిన మనిషి నా దగ్గిరికి వచ్చినందుకు నాకు పరమానందంగా వుంది' అన్నాడు. 'నా కళ కూడా నా లాగే ముసలిదై పోయిం దను కున్నాను. లేదు. అదింకా పడు చుగా బ్రతికే వుంది. ఎప్పటికీ అలాగే వుంటుంది. చరిత్రలో నా శిల్పాలు నాలుగు కాలాలపాటు నిలుస్తాయి. చాలు. అది చాల బ్బాయ్! అదే నా క్కావలసింది.' ఆయనలో వుద్రేకం కనబడింది.

వెంటనే నాకు నా 'మహాశిల్పి' యీ వ్యక్తేనని తెలిసింది. ఆయన మీద పూజ్య భావం ఏర్పడింది. నాలో ఆయనంటే ఎంతగానో ఆసక్తి పెరిగింది. సాటిలేని తన అభిమాన తార దర్శనభాగ్యం లభిం చిన మూడవ తరగతి ప్రేక్షకుడికి కలిగే అనుభూతిలాంటి అనుభూతి, యీ క్షణం ఆయన సమీపంలో నాకు కలిగింది. నా జన్మ చరితార్థ మైనట్టు భావించేను. మీకు నవ్వు రావొచ్చు. కాని నాకు శిల్పా లంటే అంత పిచ్చి!—

ఇంతలో 'మహాశిల్పి' కూతురు మంచినీళ్లు తెచ్చియిచ్చింది. ఆమె లోపలికి తిరిగి వెళ్తోన్నప్పుడు చూస్తే ఆయన చేతిలో ప్రాణం పోసుకున్న శిల్పం ఏదో కదిలి నట్లనిపించింది నాకు. మెరిసేలా తోమిన గ్లాసుమీద కదిలిపోయే ఆమె రూపం చిత్రంగా సాగి మెరి సింది.

ఆమె లోనికి వెళ్ళాక, ఆయన్ని పేరడిగేను. చెప్పేడు. మనిషికి తగ్గ పేరు – నరసింహాచార్యులు.

మంచినీళ్ళు త్రాగుతూ అను కున్నాను– ప్రతి గొప్ప కళాకారుడి సృష్టిలోనూ అతడి కష్టమూ– యిష్టమూ, ఓర్పూ – నేర్పూ అన్నిటినీ మేళవించుకొని వెలసిన కళా ఖండం ఏదో వొకటి వుంటుంది.

---

● 'అదేమిటి, కారుకి రంగులు చిత్రంగా వేయించావ్! ఈ వేపు నీలం, ఆ వేపు ఎరుపు ?'

'అంతే ఏదేనా యాక్సిడెంట్ జరిగినాక, కోర్టులో కారు ఏరంగుదో చెప్పమంటే కొందరు నీలం అనీ కొందరు ఎరుపనీ – ఇలా అనేసరికి కేసు తేలిపోవాలని!'

అలాగే యీ నరసింహాచార్యులు గారికికూడా ఏదో వొక మాస్టర్ పీస్ వుండే వుంటుంది అనిపించింది. మంచినీళ్ళగ్లాసు క్రిందపెట్టి, ఆయనకి నా వుద్దేశ్యం తెలియజెప్పి ధోరణిలో "చూడండీ" అంటూ అడగబోయేను.


"వెంటనే ఆయన 'నేను చూడలేనబ్బాయ్!' అన్నాడు.

ఒక్కసారిగా నా ఆలోచనా ప్రవాహం ఆగిపోయింది. నాలో ఆయన జవాబు రగిల్చిన ఆశ్చర్యం గుండెని ఝల్లు మనిపించింది.

ఇందాకే నాకు నరసింహాచార్యులుగారి శిల్ప చాతుర్యమంతా ఆయన కళ్ళలో కొట్టొచ్చినట్టు కనబడింది. ఇంతవరకూ, గొంతుక వినీ చూడాయగా నా వయస్సు పసిగట్టిన ఆయనయొక్క గ్రుడ్డితనం తెలీక—ఆ కళ్ళు చెప్పని భావాలెన్నో నాలో వూహించుకున్నాను. పొరపాటు జరిగి పోయిందని కింగ పడ్డాను.

నా మౌనం ఆయన తెలుసుకున్నట్టుంది. మాటలు కదిపేడు—"ఇంతసేపూ నాకు కళ్ళున్నాయను కున్నావ్ కదూ ?" నవ్వేడు. "ఎందుకు లేవూ వున్నాయ్. కాని యివి శిల్పాలు చెక్కడానికి పనికి రావు. వెలుతురు చూడలేవు. అడపా తడపా వుద్రేకాలొస్తే కాసిని కన్నీళ్ళు కారుస్తాయంతే. అంతకుమించి వీటి కేపనీ చేతకాదు. నేనూ అంతే. నడవలేను. కళ్లు పోయినప్పుడే కాళ్ళూ పోయాయి. అప్పట్నించీ యీ మంచమే నా జీవితం" ఆయన ఆగేడు.

నేను మళ్ళీ యిందాకటిలాగే చలించేను 'నా మహాశిల్పి' అంధుడూ, అశక్తుడూ అయిపోయినందుకు తీరని జాలితో నా మనస్సు రెపరెప లాడింది. ఆయన కేసి చూసేను. శరీరమూ, జీవితమూ కలిసి మిగిల్చిన కష్ట నష్టాలకి తగినంత బాధ నరసింహాచార్యులు గారితో నాకు కనిపించలేదు. ఆయనే చెప్పేడు — "కళ్లు పోయాయనికాని, కాళ్ళు పోయాయని కానీ నా కేమాత్రం విచారంలేదు. ఎందుకో తెలుసా ? ఈ దేహంతో ఈ మహత్తర శిల్ప సృష్టి ఏనాడో పూర్తి చేసేశాను. నా జీవితంలోనే సాధిద్దా మనుకున్న మహా ఫలితం ఏనాడో సాధించేశాను. అదేమి టనుకున్నావ్ ? కళాఖండం. నేను చెక్కిన శిల్పాలన్నీ వొక ఎత్తు. అదొక్కటీ ఒక ఎత్తు చూపుల క్కూడా ఎత్తయిందేలే — 24 అడుగులు." నరసింహాచార్యులు నిర్వికారంగా మాట్లాడేడు. నాకు వెంటనే ఆ కళాఖండాన్ని తనివి తీరా చూడాలనిపించింది. కాని, ఆయన తన కళాఖండం ఎంత గొప్పదో చెప్పేడేగాని, ఎలా వుందో ఎక్కడుందో చూడమని మాత్రం చెప్పలేదు. అంచేత నేనే కలుగజేసుకుని—"ఏదీ? ఎక్కడుంది మీ




కళాఖండం?' అని ఆతృతగా ఆసక్తిగా అడిగేను.

నరసింహాచార్యులుగారు నా ప్రశ్న విని, మోచేతులమీద సగం లేచేరు, మంచంమీంచి లేచి క్రింద పడతారేమోనని భయం వేసింది. పట్టుకోడానికి సిద్ధపడాలనుకున్నాను కాని సగం లేచేక ఆయన అలాగే వుండిపోయి మొదలెట్టేరు— 'చూడబ్బాయ్! నువ్వు అశోకుడి గురించి చదివేవుంటావు షాజహాను గురించి కూడా చదివేవుంటావు—'

నాకు చిరాకేసింది — కళాఖండం చూపించకుండా మాట మారుస్తారేమిటూ? అని. ఒకవేళ సస్పెన్స్ కలిగిద్దామనుకుంటున్నాడేమో! హిచ్‌కాక్ గడ్డం పెంచుకుంటే యిలాగే ఉంటాడేమో! అనుకున్నాను. ఏమైనా చేసేది లేక వినడం మొదలెట్టేను. ఆయన చెబుతున్నాడు— 'చెప్పుకోడం కాదుగానీ నాకూ ఉంది పెద్ద చరిత్ర. నన్నడిగితే నాకున్న గతం షాజహానుక్కూడా లేదంటాను. చూడబ్బాయ్! ఒక్క సంగతి యిన్నాళ్ళకి నేనంటే అభిరుచితో వచ్చిన మనిషివి నువ్వొకడివి కనబడుతున్నావ్. బహుశా మనిద్దరికీ ఏదో పూర్వజన్మ సంబంధం వున్న

ట్టుగా ఉంది సమయం వచ్చింది కాబట్టి చెబుతున్నా విను అసలు సంగతేవిటంటే–

అప్పట్లో నాకు పాతికేళ్ళ వయస్సూ, పాతికెకరాల భూమీ వుండేవి. నిత్యమూ శిల్పాలు చెక్కాలనే ధ్యాసతప్ప నాకు మరో దృష్టి వుండేదికాదు. ఆ రోజుల్లో ఈ చేతుల్తో నేను ముట్టని మట్టిగానీ, కొట్టని రాయిగానీ లేదు. చాలా మట్టిబొమ్మలు చేశాను. కనిపించిన రాయినల్లా తెచ్చి, ఖరారైనబొమ్మలెన్నో ఖచ్చితంగా చెక్కాను. ఆమీదట దేశంలో గొప్ప శిల్పాలన్నిటికీ మించిన మహాశిల్పాలు చెక్కాలనుకున్నాను. అంతే. వెంటనే బయల్దేరి దేశమంతా తిరిగాను. చూశాను. చాలా చూశాను. హంపీ శిథిలాలు, అజంతా ఎల్లోరాలు, ఆగ్రా ఢిల్లీలు, గొప్ప గొప్ప కోటలు, దేవాలయాలూ, మసీదులూ–ఓహ్! వాటికేవిటి? సమస్తమూ చూశాను. తిరిగొచ్చాక నేననుకున్నంత పని చెయ్యగలిగాను. గర్వపడుతున్నా ననుకునేవ్! అప్పటికీ అగ్రహారం చుట్టుపక్కల నేనంటే తెలియని మనిషి లేడు. అద్భుతమైన శిల్పినని అంతా మెచ్చుకునేవారు. అయినా నాకెందుకో తృప్తి వుండేదికాదు. ఎన్ని మలిచినా కూడా, నే చెక్కాల్సిన శ్రేష్ఠమైన శిల్పం యింకా తయారుకాలేదనే అనిపించేది. అలాగే రోజులతరబడి చెక్కేవాణ్ణి. దాంతో ఆదాయం లేకపోగా ఆస్తంతా హరించుకుపోవడం మొదలెట్టింది. అప్పుడికీ లాభంలేదని, నన్నేదో బాగుచేస్తారంటూ మా పెద్దలంతా కలిసి నాకు పెళ్ళిచేసేశారు. కాని పెళ్ళయ్యాక నా ధోరణి మరీ ఎక్కువైపోయింది. కారణం ఏవిటో తెలుసా?– మా ఆవిడ అచ్చం అప్సరసే అనుకో. ఈ కాలం పిల్లలు దాని అందం ముందెందుకూ పనికి చెయ్యరు. ముసిలిపీనుగ పెళ్ళాం సొగసు వర్ణిస్తున్నా డనుకునేవ్. నామాటల్లో అసలు ఉత్ప్రేక్షలుండవు. ఉన్నదున్నట్టే. నే బొమ్మ చెక్కినానంతే. అయిందా. అప్పుడేం చేశానూ?' అంటూ పక్కకివొత్తిగిల్లేరాయన.

'ఏంచేసేరు?'

'శిల్పం చేశాను. అమర శిల్పం. మా ఆవిడ శిల్పం. అచ్చం అప్సరసని అప్సరసలా చెక్కేశాననుకో. పోలికలన్నీ పోతపోసినట్టు తీసుకొచ్చాను కాని, కాని యిప్పుడది లేదు. చచ్చిపోయింది. ఉంటే చూసుకుని ఎంత మురిసిపోయేదో! నన్నెంత మెచ్చుకునేదో–' నరసింహాచార్యులుగారి కంఠం బొంగురుపోయింది. ముందు చెప్పినట్లుగా ఆయన చూడలేని కళ్ళు చెమర్చేయి. ఆయనలో బాధ చూసేను. నరాలు గిజగిజలాడేయి.

అంతలోనే ఆయన అనుభూతి మార్చుకున్నాడు. మామూలుధోరణి తెచ్చి పెట్టుకోడానికి ప్రయత్నించి, గొంతు సర్దుకుంటూ అన్నాడు.

'చూడబ్బాయ్! షాజహాను పెళ్ళాన్ని ప్రేమించే కదూ తాజమహాలు కట్టించేడు? కాని, నన్ను చూడు - నేనూ ప్రేమించాను నా భార్యని. షాజహానుకంటే అమితంగా ప్రేమించానేమో కూడా. ప్రేమించడమే కాదు-ప్రపంచంలో అందాన్నంతా ధిక్కరించేలా ఉన్న 'ఆమె' రూపాన్ని అపూర్వంగా మలిచాను. పెళ్ళాన్నంత ప్రేమించీ షాజహాను తాజమహాలు తనుగా తను కట్టలేక పోయాడు. ఎవరిచేతో కట్టించాడు. కాని నేను! నా చేత్తో నేను మలిచాను దాన్ని. ఇప్పుడు చూడు! పెద్ద కొండరాయి వుండే దక్కడ. దొలిచి ప్రాణాలు పోశాను. అదే నా కళాఖండం!'- గర్వంగా కిటికీ వేపు చాచిన చేత్తో సూచిస్తూ చూపించేడు. తటాలున నేను ఆత్రంగా వంగి చూసేను. బాగా చూసేను. నాకేమీ కనిపించలేదు. ఇందాక నే నిలబడ్డ పచ్చగడ్డి స్థలం, దాని వెనక పొలాలూ, దూరాన కొండ అంచులూ తప్ప మరేమీ కనిపించలేదు.

నరసింహాచార్యులు గారింకా మాట్లాడుతున్నాడు- 'నేను గొప్ప వాణ్ణి కాదూ? షాజహాను కంటె గొప్ప చరిత్ర పురుషుణ్ణి కాదూ? చెప్పబ్బాయ్!'

నాకేం మాట్లాడాలో తెలియలేదు. నరసింహాచార్యులుగారు ఏదో గొప్ప కళాఖండాన్ని చూపిస్తాడనుకున్నాను. చూస్తాననుకున్నాను. ఫలితంగా నాలో గొప్ప నిరుత్సాహం కలిగింది. నరసింహాచార్యులుగారికి పిచ్చిమోనన్న అనుమానం కూడా కలిగింది. నాకేమీ కనిపించడంలేదని చెబుదా మనిపించింది నా కళ్లు ఆయనవి, ఆయన కళ్ళు నావి అయిపోయినట్లుగా వుంది. నెమ్మదిగా కూర్చున్న వాణ్ణి లేచేను. పెదవి కదిలేంతలో పెద్ద శబ్దం వినబడింది. వెనక్కి తిరిగి చూసేను. నేల విడచిన నటిగిన్నెను పైకెత్తుకుంటూ, జారవిడిచిన నీలి పైటను మెడచుట్టూ తిప్పుకొంటోంది--- 'మహాశిల్పి' కూతురు.

ఆయన పిలిచేడు.- 'అమ్మాయ్ నువ్వేనా? ఒక్కసారి యిలా రామ్మా!'

ఆమె గిన్నె క్రిందబెట్టి గబగబా వచ్చింది. ఎందుకో కంగారు పడుతోంది. నిదానంగా నిలబడింది. ఆమె నడిచి వచ్చిన సవ్వడి విన్నాక ఆయన-'చూడమ్మా! ఇతన్ని కాస్త అలా తీసుకువెళ్ళి మీఅమ్మ బొమ్మని చూపిస్తావూ!' అన్నాడు.

'రండి!' అంటూ కదిలింది. ఆమె మాట్లాడ్డం మొదటిసారిగా విన్నాను. ఆమెని అనుసరించేను ఇద్దరం గుమ్మం దాటి, మెట్లు దిగేం. నాపరాళ్ళ మీదుగా నడిచేం. 'మరో క్షణానికల్లా - చాలా సేపటి క్రితమే నేను తాకి చూసిన రాతి పాదాల దగ్గరికి నడిచి ఆమె ఆగిపోయింది. నేనూ ఆగేను.

'చూడండి!' అని రెండవసారి మాట్లాడింది.

నేను చూసేను. ఇప్పటికిగాని నా మెదడు పని చేయలేదు. కళాఖండం వ్యూహాలోపడి శిథిలాన్ని విస్మరించేనని మెలకువ కలిగింది. నివ్వెర పోయేను. ఇదా నా 'మహాశిల్పి' కళాఖండం! ఇదా నరసింహాచార్యులుగారి చరిత్ర చాటే కళాఖండం! దీని కోసమేనా తిన బతిలేదని నిరుత్సాహ పడ్డాను! దీని కోసమేనా నరసింహాచార్యులుగారికి పిచ్చి వుందని అనుమానించేను! — అనిపించింది. గుండె బరువెక్కినట్టయింది. మనస్సు మరోసారి రెపరెప లాడింది. కళాఖండపు ఖండాన్ని మరోసారి చూసేను. విరిగిన పాదాలు — మెత్తగా, సుకుమారంగా అనిపిస్తున్నాయి. పాదాల దిగువకి జారిన పలుచని వస్త్రభాగం చిరిగిన కలువ రేకులా వుంది. ఏవేవో ఆభరణాలు, నగిషీలు — వనితనమంతా పాదాల్లోనే వుపయోగించేసినట్టుంది. మిగిలిన శిల్పమంతా చూడగలిగితే ఎంత బాగుణ్ణు! — యింతక్రితం చూసినప్పటిలాగే అనుకుంటున్నాను. మరోలా అనుకోడం తెలియడం లేదు.

ఆమె అడిగింది 'చూశారా?'

'వచ్చేముందే చూసేను. యిది రెండవసారి' క్షణం ఆగేను. 'మీ అమ్మగారి పాదాలు యిలాగే ఉండేవనుకుంటాను.'

'అవును.'

'ఆవిడ పోయి ఎన్నాళ్ళయింది?'

'పదేళ్ళు షుమారు.'

'ఎలా పోయేరు పాపం.'

'నాన్న చంపేశాడు.'

హఠాత్తుగా అదిరి పడ్డాను. వణికేను 'ఎందుకు?' అని మాత్రం అనగలిగేను.

'అమ్మలాంటి బొమ్మని చెయ్యాలని నాన్న ఎంతో కష్టపడ్డాడు. అమ్మని ఎదురుగా కూర్చోబెట్టి, రోజుల తరబడి ఎన్నో బొమ్మలు చెక్కాడు. ఏవి అమ్మకి నచ్చలేదు. ప్రతి శిల్పంలోనూ ఏదో ఒక వంక చూపించేది. నాన్నకి పట్టుదల హెచ్చింది. మానలేదు. ఇంకా ఎన్నెన్నో చెక్కాడు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టాడు. చివరికి అమ్మ విసిగెత్తిపోయింది. తన కోసం దరిద్రాన్ని కొని తెస్తున్నారని. తనలాంటి శిల్పం తయారు చెయ్యడానికి అన్నాళ్ళూ, అన్ని రాళ్ళూ పాడుచెయ్యాలా అనడిగింది. ఆఖరికి, నాన్నకు శిల్పాలు చెక్కడమే చేతకాదంది. పైగా పాడు బొమ్మలు చెక్కి పచ్చటి బ్రతుకంతా పాడుచేస్తున్నారని ఆ బొమ్మలన్నీ పగలకొట్టించింది. నాన్న కప్పుడు విపరీతంగా కోపం వచ్చింది. ఆయన కెప్పుడూ కోపం రాలేదు. అదే మొదటిసారి నాన్నకి తన చేతిమీద నమ్మకం ఎక్కువ.

తన శిల్పాలే ఆయన ప్రాణాలు. తన నేర్పుని తన శిల్పాన్ని కించ పరచడం నాన్న సహించలేక పోయాడు. అమ్మతో ఘర్షణపడ్డాడు. ఆ ఘర్షణలో చేతనున్న ఉలిని అమ్మమీదికి కోపంగా విసిరాడు. కణతకి తగిలింది రక్తం కారింది. అంతే అమ్మ చచ్చిపోయింది." ఇలా చెప్పినంతసేపూ ఆమెలో నిర్లిప్తత తప్ప మరే భావంలేదు. బహుశా పాత భావాలన్నీ ఘనీభవించి గుండెని రాయిచేసి వుంటాయి. శిల్పన్నప్పుడు నరసింహాచార్యులు గారికి తెలిస్తే కూతురి గుండెని కూడా శిల్పంగా చెక్కేవాడేమో!"

ఆమె చెప్పడం అయిపోలేదు. "అమ్మపోయాక. నాన్న కోపమూ పోయింది. ప్రాణంలేని రాళ్ళకి ప్రాణంపోసిన ఉలితో, ప్రాణమున్న అమ్మప్రాణం కాస్తా బలి తీసుకున్నానని కుమిలి పోయాడు. చాలా రోజులు విచారంతోనూ, పశ్చాత్తాపంతోనూ గడిపాడు. చివరికి అమ్మ జ్ఞాపకార్థం అయిదేళ్లు రాత్రీ పగలూ కష్టపడి యీ శిల్పం చెక్కాడు అమ్మ బ్రతికి ఉంటే దీనికి వంక పెట్టేదికాదు. అంత బాగా చెక్కాడు. నిజం చెప్పా లంటే అమ్మలాంటి బొమ్మని అమ్మ పోయాకే తయారు చెయ్యగలిగాడు నాన్న." ఆమె ఆగింది. పరాయి వ్యక్తిలో ఆమె యింతసేపు నిబ్బరంగా, ధారాళంగా మాట్లాడ గలిగిన మనిషి అని నేను మాత్రం వూహించలేదు. చీర కొంగుతో చెంపల్ని తుడుచుకొని అంది— "కాని శిల్పమంతా పూర్తయ్యాక, అమ్మ భుజాలమీద నిలబడి—తల పాపిట సవరిస్తూ చివరి మెరుగులు చెక్కు తూంటే కాలు జారి నాన్న క్రింద పడిపోయాడు. తలకి పెద్ద గాయం తగిలింది. మెదడు దెబ్బతిందిట. అప్పట్నించీ నాన్న చూడలేడు. నడవలేడు. అమ్మని చంపినందుకు శిక్షనుకుని అస్తమానం కన్నీళ్ళు పెట్టుకుంటాడు."

మగాడిలా మాట్లాడే స్త్రీ ఎప్పుడూ తెలియదు నాకు ఆమె మాటలు వింటోంటే 'మహాశిల్పి' కూతురు కాక, కొడుకు మాట్లాడు తున్నట్టనిపించింది నాకు. నే నడి గేను, 'మీరు మగాడిలా ఎందుకు మాట్లాడుతున్నా'రని కాదు

"మరయితే ఎందుకిలా శిథిలమై పోయింది ?"

"ఎవరో గొప్ప వ్యక్తిట. ఆ మధ్య యీ వూరొచ్చాడు. స్వాములు వారో, సన్యాసో—తెలీదు నాకు. దేశమంతా కాలి నడకనే నడుస్తాట్ట. ఏదో వుపన్యాసాలిచ్చాడు. మున సబుగారు ఈ ప్రదేశాన్ని ఆయనకి భూదానం చేశాడు. అప్పుడాయన యీ విగ్రహాన్ని చూశాడు. ఆవ హ్యించుకున్నాడు. అమాయకులైన ప్రజల్లో యిలాంటి శిల్పాలు చెడ్డ ఆలోచనల్ని ప్రేరేపిస్తాయట. శృంగార వాంఛల్ని రేకెత్తిస్తా యట."

"బహుశా అప్పుడు ఆయనలో అలా రేకెత్తి వుండొచ్చు."


"ఏమో! శిష్యులతో కలిసి విగ్రహాన్నంతా ఛిన్నా భిన్నం చేసి వెళ్ళిపోయాడు. కోపంలో అమ్మని చంపేసినా — యీ బొమ్మ చెక్కి నాన్న మళ్ళీ అమ్మకి ప్రాణం పోశాడు. కానీ రెండవసారి కూడా అమ్మ చంపబడింది. నేనడ్డుపడ్డాను, ఏడిచాను, తల బాదుకున్నాను. లాభంలేకపోయింది పైగా 'మా అమ్మని చంపకండి' అని ఏడిస్తే అందరూ నన్ను ఆపహాస్యం చేశారు. సిగ్గు భరించలేక నేనుకూడా చచ్చిపోయానను కున్నాను. ఇక నేను చెయ్యగలిగిందల్లా ఆ క్షణంలో ఒక్కటే మిగిలింది. యీ అమానుష విషయం నాన్నకు తెలియకుండా జాగర్త పడ్డాను. తెలిస్తే నాన్న గుండె పగిలేది పాపం-యింకా యిక్కడ అమ్మ శిల్పం వుందను కుంటున్నాడు. ఆ ఆసరాతోనే నాన్న బ్రతికున్నాడు." రెండు సెకన్లు ఆగింది. "చూడండి లోపలికి వెళ్తాక నాన్న మిమ్మల్ని అడుగుతాడు. అమ్మ శిల్పం ఎలా ఉందనికి- దయ చేసి. బాగుందని చెప్పండి! — నాన్న కోసం. నాకి ప్రపంచంలో నాన్న తప్ప ఎవరూ లేరు. నాన్న పరపతి తప్ప మాకు మరో బ్రతుకుతెరువు లేదు. నాన్నని నేను కాపాడుకోవాలి. కాదు మీరే కాపాడాలి. ఇంతకంటే నాకు మరో మార్గం లేదు. నాన్నని కాపాడి పెట్టండి! మా బ్రతుకు నిలబెట్టండి! అమ్మ బొమ్మ బాగుందని చెప్పండి! చిన్న అబద్ధం—చెబుతారు కదూ?" ఆమె గొంతులో దైన్యం, వేడికోలు నా మనస్సుని కదిపేయి. నేను చాలా చాలా చలించేను. అంతా నా కో చిత్రమైన అనుభూతిలా వుంది. "అలాగే" అన్నాను. ఆమె చేతులు కలిపి నమస్కారం చేసింది. కృతజ్ఞత అనుకుంటూ.

"పదండి వెళ్దాం" అంది

ఆమె వ్యక్తిత్వంలో తెలియని వైరుధ్య మేదో వుంది. నా కర్థం కాలేదు. ఇద్దరం వెనక్కి తిరిగి నడిచేం. సాయంత్రం పలుచని చీకటి రాకని చూచాయగా సూచిస్తోంది. నాకు ప్రయాణం గుర్తొచ్చింది. త్వరపడా లనిపించింది.

ఆమెతో ఇంట్లోకి ప్రవేశించేను. లోపల వెలుగు బాగా తగ్గింది. నరసింహాచార్యులుగారి మంచంకేసి నేను వడివడిగా నడిచేను. ఆయన రెండు చేతులూ కలిపి పట్టుకున్నాను. లేనివుత్సాహోద్రేకాలని సృష్టించు కున్నాను. అన్నాను—

"ఆచార్యులుగారూ! నిజంగా యీ రోజు నా జన్మ తరించింది. అసమానమైన శిల్పకళ దర్శించే భాగ్యం నాకు కలిగించేరు మీలాంటి మహాశిల్పులు నూటికి కోటికి ఎక్కడో ఎవరొక్కరో వుంటారు. పొగడ్త అనుకోకండి. నాకు పొగడ్డం చేతకాదు. అసలు నా అనుమానంమీరేదో దైవాంశతో పుట్టి వుండాలని. ఇంత అద్భుత




మైన కళాఖండం ఎప్పుడూ, ఎక్కడా, చివరికి కలలో కూడా నేను చూడలేదు.'

నేను అప్పుడప్పుడు శ్రవ్య నాటికల్లో పాల్గొన్నాను. బాగానే అనగలిగేను. ఎంచేతనంటే నా మాటలకి నరసింహాచార్యులు గారిలో ఎదురు చూసిన ప్రతిభావాలన్నీ ఎంతో బాగా కనిపించేయి. తెగని సంతోషం, తృప్తీ నరసింహాచార్యులు గారి గుడ్డి కళ్ళల్లో నీటిని తిప్పేయి. గిల్టీగా ఫీలయ్యేను.

నరసింహాచార్యులు గారు పొంగిపోయేరు. మంచి వుత్సాహాన్నీ, మంచి కృతజ్ఞతనీ మాటల్లో చెప్పేరు — 'చాలా సంతోషమబ్బాయ్! చాలా సంతోషం! నాకీ రోజు నా చిన్నప్పటి దీపావళి పండగంత హాయిగా ఉంది నా కళాఖండాన్ని బాగా చూశావు కదబ్బాయ్!- ఆ కళ్ళూ, ముక్కూ, శంఖులాంటి మెడా, గుండ్రగా జారిన భుజాలూ, వాటిమీంచే జారిపడే కళ్ళూ, కాళ్ళూ పోగొట్టుకున్నాను-అంత నునుపుగా చెక్కేను దాన్ని—బాగా చూశావు కదూ? నే చెప్పిందంతా అక్షరాలా నిజమే కదూ ...'

ఇంకా ఏదో అంటున్నాడు. నాకేమీ వినిపించడం లేదు. వినిపించినా అర్థం కావడం లేదు. కాళ్ళ క్రింద పుట్టుకిచ్చిన పుణ్యభూమి తొలుచుకుపోతున్నట్టుగా ఉంది.

'ఈపాటికి బస్సు దాదాపు బాగయిపోయి ఉంటుంది. ఆలస్యమైతే అందుకోలేను, విశాఖపట్నం వెళ్ళాలి. ఇక సెలవు తీసుకుంటానండీ!' అన్నాను

'మంచదబ్బాయ్! క్షేమంగా

వెళ్ళు! ఎప్పుడన్నా వీలుపడితే ఇటు కేసో చూపు చూడు."

"ఎంతమాట వస్తానండీ!" అని ఆయన చూడలేకపోయినా, నరసింహాచార్యులు గారికి నమస్కారం పెట్టి కదిలేను. ఆమె వీధి గుమ్మం దగ్గర నిలబడి కనబడింది. కృతజ్ఞతని చిరునవ్వుగా తయారుచేసి పెదాల మధ్య చూపించింది. ఇప్పటికిగానీ నాకు ఆమె అందం కేసి మనను పోలేదు. కాని టైము తక్కువగా వుండడంవల్ల ఒకేమాట 'వస్తానండీ!' అని చెప్పి మెట్లు దిగేను.

నాపరాతి ముక్కలమీద నడుస్తున్నాను.

పాపం! కండలు కరిగించుకుని కళాఖండం మలిచిన నరసింహాచార్యులుగారు తన ప్రేమ కథకి చరిత్రలో షాజహానుకంటే వున్నత స్థానం వుంటుం దనుకుంటున్నాడు. కళ్ళు పోగొట్టుకుని పిచ్చిగా వూహించు కుంటున్నాడు. కాని ఆయనకి తెలియదు. ఊహల్ని కాదనే నిజం వుంది. కళాఖండమూ, ప్రేమా, చరిత్రా ఏవీ ఆయనకు దక్కలేదు. అవును. ఎలా దక్కుతాయి? నరసింహాచార్యులు లేనివాడు. అతి సామాన్యుడు. సామ్రాజ్యాధినేత కాడు. రాజకీయ నాయకుడూ కాడు. కేవలం ఒక పేద శిల్పి. పేదవాళ్ళ ప్రేమలో ఎంత బలం వున్నా ప్రయోజనం లేదు. మహా ధనవంతుడైన షాజహాను చక్రవర్తి అపూర్వమూ, అద్భుతమూ అయిన తాజ్‌మహాల్ కట్టించి నరసింహాచార్యులుగారి లాంటి పేదవాళ్ళ ప్రేమకి విలువ లేకుండా చేసేడు. ఎవడో రాజకీయ సన్యాసి మహాశిల్పాన్ని నాశనంచేసి ఆయన చరిత్ర నిలువకుండా నిర్జించేసేడు. ఛీ ఛీ!— వీళ్ళా భారతదేశం మనుషులు! గురజాడకవి దేశమంటే మట్టికాదు, మనుష్యులే అని చెప్పేడుగానీ— నా కిప్పుడు యిలాంటి మనుషులు వున్న దేశాన్ని వొత్తి 'మట్టి' అనుకుంటేనే బాగుణ్ణని పిస్తోంది. లేకపోతే, కొన్నాళ్ళకి దేశంమీద ఏవగింపు కలిగి, నాలో వుందను కునే కొద్దిపాటి దేశాభిమానం చచ్చిపోతుందేమోనని భయం కూడా వేస్తోంది.

ఆలా ఆలోచనలు పేర్చుకుంటూ కొంత దూరం నడిచేక, ఎందుకో వెనక్కి తిరిగి చూడాలనిపించింది. చూసేను! నరసింహాచార్యులు గారి పాత పెంకుటిల్లు చిన్న అట్ట పెట్టింగులా కనబడింది. నాలో యిప్పుడు ఒక గొప్ప కళాఖండాన్ని చూడలేకపోయాననే దిగులు తొలిగిపోయి, నా 'పేద మహాశిల్పి' నరసింహాచార్యులుగారి ప్రేమనీ, తృప్తినీ, చరిత్ర స్థానాన్నీ కాపాడ గలిగానన్న సంతోషభావం కమ్మగా, తియ్యగా కలిగి పెరిగింది.

□□□